
RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శనివారం | 10 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 266 | పేజీలు : 4 | వెల : 5/-



## పీవీ.. భారత ఠీవీ

- 'భారతరత్న'తో గౌరవించిన బీజేపీ సర్కార్
- భారత కీర్తిపతాకలో తొలి తెలుగు వ్యక్తి
- మరో ముగ్గురికి దేశ అత్యున్నత పురస్కారం
- పీవీ, చరణ్‌సింగ్, స్వామినాథన్‌కు స్థానం
- ఒకే ఏడాదిలో ఐదుగురికివ్వడం ప్రథమం

న్యూఢిల్లీ - ప్రభాతసూర్యుడు : మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా ఈ ప్రకటన చేశారు. చీ వేదికగా పోస్ట్ పెట్టారు. పీవీ నరసింహా రావుని భారతరత్నతో సత్కరించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. పీవీ నరసింహారావుతో పాటు మరో మాజీ ప్రధాని చరణ్ సింగ్‌కి కూడా భారతరత్న ప్రకటించారు. వీరితో పాటు భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథ్‌ను దేశ అత్యున్నత పుర- స్కారానికి ఎంపిక చేసింది

మిగతా 3వ పేజీలో...



## అంతా 'రామ'మయం!

- రాజధానిలో ఫార్ములా రేసింగ్‌పై నిజానిజాలు
- కేటీఆర్ ఆదేశాలతోనే రేసుల నిర్వహణ
- రెవెన్యూ స్పెషల్ సీఎస్ అరవింద్ వివరణ

ఫార్ములా ఈ-రేసింగ్ నిర్ణయం కేటీఆర్‌దేనని.. కేటీఆర్ ఆదే శాలతోనే సెప్టెంబర్ 25, 2023లో సీజన్ 10కు ఒప్పం దం చేసుకున్నామని అరవింద్ కుమార్ రిప్లై ఇచ్చారు.

3లో




# సెక్రటేరియట్‌లో చీకటి కోణాలు!

- సచివాలయం నిర్మాణం వ్యయంపై అవినీతి ఆరోపణలు
- కాళేశ్వరం తర్వాత పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగం
- విచారణ జరిపేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ పరిపాలనా సౌధం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయం నిర్మాణంలో అవినీతి జరిగిందని ప్రభుత్వం అనుమానిస్తోంది. ఆ భవనానికి అయిన ఖర్చు విషయంలో క్లారిటీ లేదు. ఈ భారీ నిర్మాణానికి అయిన ఖర్చెంత అంటే ఇతమిద్ధంగా ఇంత అని చెప్పలేని పరిస్థితి ఇప్పుడు అధికారవర్గాల్లో కనిపిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక భవనానికి చేసిన వ్యయం విషయంలో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణలను చాలా సార్లు కాంగ్రెస్ చేసింది. తాము అధికారంలోకి వచ్చాక విచారణ చేయిస్తామనిచెప్పింది. ఇప్పుడు ఆ దిశగాచర్యలు తీసుకుంటున్నారు. సచివాలయం నిర్మాణం లో జరిగిన కొన్ని పనులకు అసలు టెండర్లే పిలవక పోవడంతో అవినీతి జరిగిందని విచారణ జరిపించడనికి రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఓ అవకాశం లభించినట్లయింది. ప్రధానంగా ఐటీకి సంబంధమైన పనుల విష యంలో వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుని అమలుచేశారనే అరోప ణలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయం సెక్యూరిటీతోపాటు అంతర్గతంగా అవసరమైన ఎలక్ట్రానిక్, కంప్యూటర్ సంబంధమైన నెట్‌వర్కింగ్ పరికరాలు, సాఫ్ట్‌వేర్, ఇతరాలకు దాదాపు రూ. 300 కోట్లు ఖర్చు చేశారు. అంత భారీగా ఖర్చవడానికి అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎంత అత్యాధునికమైన నెట్ వర్క్ కోసం ఖర్చు పెట్టినా యాభై కోట్ల లోపే ఉ ంటుందంటున్నారు. సెక్రటేరియట్ భవనానికి తొలుత వ్యయం రూ.550 కోట్లుగా డీపీఆర్‌లో

మిగతా 2వ పేజీలో...




## సిటీగా హైదరాబాద్

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో చాలా అంశాలపై క్లారిటీ ఇచ్చారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై టీజర్ లాంటి అప్‌డేట్స్ ఇచ్చారు. భవిష్యత్‌లో చేపట్టబోయే పను లను తన ప్రసంగంలో తమిళిసై వివరణ ఇచ్చారు. అలాంటి వాటిలో ముఖ్యమైంది ఏఐ సిటీ. ఉమ్మడి రాష్ట్రంలో 1990 వరకు హైదరాబాద్ అంటేనే ఛార్మినార్, గోల్కొండ వంటి చారిత్రాత్మక కట్టడాలు గుర్తుకు వచ్చాయి. ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చంద్రబాబు హయాంలో ఐటీకి ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రత్యేక సిటీ రూపాంతరం చెందింది. దాన్ని సైబరాబాద్‌గా పిలవడం

మిగతా 3వ పేజీలో...



## 96.88 కోట్లు

### లోక్‌సభ ఎన్నికల్లో రిజిస్టర్డ్ ఓటర్ల సంఖ్య

న్యూఢిల్లీ - ప్రభాతసూర్యుడు : పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే ఏదో సమయంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అర్హులైన ఓటర్ల సంఖ్యను ఎన్నికల కమిషన్ శుక్రవారంనాడు ప్రకటించింది. ఓటింగ్‌కు సుమారు 97 కోట్ల (96.88 కోట్లు) మంది అర్హులని తెలిపింది. 18 నుంచి 29 ఏళ్ల లోపు వయసున్న 2 కోట్ల మందికి పైగా యువ ఓటర్లను జాబితాలో చేర్చినట్టు వెల్లడించింది. 2019 లోక్‌సభ ఎన్నికలతో

మిగతా 2వ పేజీలో...



## మల్కాజిగిరికి మహా డిమాండ్!

- ఎంపీ స్థానానికి యమ గిరాకీ
- బీజేపీలో పెరుగుతున్న ఆశావహులు
- అభ్యర్థుల ఎంపిక గగనమేననే చర్చ
- రాజీ కోసం మొదలైన రాయబారాలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : బీజేపీలో సీనియర్ నేతలు టికెట్ ఫైట్ చేస్తుండడంతో మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం హాట్‌టాపిక్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండుచోట్లా పోటీచేసి ఓడిపోయిన ఈటల రాజేందర్ మల్కాజ్‌గిరిలో పోటీకి సై అంటున్నారు. మరోవైపు బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు మల్కాజ్‌గిరిలో ప్రచారం కూడా మొదలుపెట్టారు.

## ఓడవని ఓటుకు నోటు కేసు




- విచారణ మధ్యప్రదేశ్‌కు మార్చాలి
- సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు
- సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరిన బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి
- రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి ధర్మాసనం నోటీస్ జారీ

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు నోటీసులు జారీచేసింది. తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు విచారణను తెలం గాణ నుంచి మధ్యప్రదేశ్‌కు మార్చాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైదరాబాద్ నుంచి కేసు విచారణ మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు మార్చాలని ట్రాన్స్ఫర్ పిటిషన్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారణ జరిపింది. కేసు విచారణను భోపాల్‌కు బదిలీ చేయా లన్న వ్యవహారంపై తెలంగాణ ప్రభు త్వా నికి, రేవంత్ రెడ్డికి, ఇతర ప్రతి వాదులకు ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. సీఎం, హోం మంత్రిగా ఒకరే బాధ్యతలు నిర్వహిస్తున్నారని వెంటనే ట్రయల్ కూడా మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు ట్రయల్ మొదలైతే విచారణపై ప్రభావం చూపే అవకాశం ఉందని పిటిషనర్ జగదీష్ రెడ్డి తరపు న్యాయవాది మోహిత్ రావు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఒకవేళ ట్రయ ల్‌పై అలాంటి ప్రభావం ఉందనుకుంటే తాము ఎలా చూస్తూ ఉంటామని జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో ట్రయల్‌ని నిలుపుదల చేస్తూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్త- ర్వులను కూడా పిటిషనర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిపై 88 క్రిమినల్

మిగతా 2వ పేజీలో...

## ఎవరిని ఎంపిగ నిలబెడదాం..?



- లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై బీఆర్ఎస్ కసరత్తు
- సిట్టింగ్ ఎంపీలకు ఈ సారి అవకాశం లేనట్టే?
- కొత్త వారిని దింపే యోచనలో గులాబీ దళపతి

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై బీఆర్ఎస్ పార్టీ కసరత్తు మొదలు పెట్టింది. ఈమేరకు కేసీఆర్ ఇప్పటికే కొన్ని స్థానాల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లకు టికెట్ ఇచ్చిన కారణంగా ఓడిపోయామన్న భావనలో ఉన్న కేసీఆర్.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సిట్టింగు లందరినీ పక్కకు పెట్టా లని అను కుం టున్నట్లు ప్రచారం జరుగు తోంది. అసెంబ్లీ

మిగతా 3వ పేజీలో...



## బీఆర్ఎస్‌లో జూనియర్ ఆర్టిసులు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : బీఆర్ఎస్ పార్టీలో జూనియర్ ఆర్టిస్ట్ ఉన్నారని, ఈ మధ్య ఆయన ఆటోలు ఎక్కడి డ్రామాలు మొదలుపెట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. పరోక్షంగా మాజీ కేటీఆర్ ను ఉద్దేశించి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు పథకం ఉండగా.. ఆటో వారిని బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస- ్తున్నారని విమర్శించారు. ఫ్రీ బస్సు పథకం వల్ల నష్టపోతున్నామని ఎవరైనా ఆటోను తగలబెట్టుకుంటారా అని రేవంత్ రెడ్డి నిలదీశారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగంపై

మిగతా 2వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్లు

**రాజన్న సిరిసిల్ల-ప్రభాతసూర్యుడు :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సమ్మక్క సారక్క జాతర సందర్భంగా రాజన్న దర్శించుకోవడం ఆనవాయితీ. గత 15 రోజులుగా రాజన్న ఆలయంలో ప్రతిరోజు భక్తుల రద్దీ కొనసాగుతుంది. ముఖ్యంగా ఆలయంలో ప్రధాన మొక్కుబడి అయిన కోడె మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే, హుండీలో కానుకలు, నగదు సమర్పిస్తారు. 14 రోజుల హుండీ లెక్కింపులో నగదు రూపేనా 2 కోట్ల 15 లక్షల 67 వేల 130 రూపాయలు, 71 గ్రాముల 500 మిల్లి గ్రాముల బంగారం, 13 కిలోల 600 గ్రాముల వెండి రికార్డు స్థాయిలో సమకూరింది.



# గురునానక్ విద్యాసంస్థల్లో రోడ్డు భద్రతపై అవగాహన

**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్, నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం "రోడ్ సేఫ్టీ అండ్ యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్" నిర్వహించారు. రోడ్డు భద్రత మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా కళాశాల విద్యార్థులు అధ్యాపకులకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం.

గురునానక్ విద్యా సంస్థలలోని జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) యొక్క సభ్యుల ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్ మారయ్య , ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఇబ్రహీంపట్నం ఇన్స్ట్రక్టర్ బి. గురు నాయుడు, రోడ్ సేఫ్టీ టెక్నికల్ టీం ఇన్స్ట్రక్టర్ స్టాలిన్ జోసెఫ్, హాజరైనారు. ఈ సందర్భంగా బి. గురు నాయుడు మాట్లాడుతూ రోడ్డు భద్రత యొక్క ప్రాముఖ్యతను గురించి చెపుతూ రోడ్లపై డ్రైవింగ్ చేసేటప్పుడు ట్రాఫిక్ నియమాల గురించి తెలుసుకోవాలి అన్నారు. టు వీలర్ నడిపేటప్పుడు హెల్మెట్ మరియు కార్ డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డ్రగ్స్ దుర్వినియోగంపై అవగాహన నిర్వహించడం ద్వారా కళాశాల విద్యార్థులలో "మిషన్ పరివర్తన్" తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తుందని ఆయన అన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ మారయ్య మాట్లాడుతూ డ్రైవింగ్‌లో ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్‌లు, సీటుబెల్టులు ధరించడం, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండటం, పాదచారుల భద్రత, క్రాస్‌వాక్‌ల పట్ల గౌరవం కలిగి ఉండడం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రహదారులలో భద్రతను మెరుగుపరచడంలో సాంకేతికత యొక్క పాత్రను ఆయన హైలైట్ చేశారు. టెక్నికల్ టీం ఇన్స్ట్రక్టర్ జోసెఫ్ విసువల్స్ ద్వారా రోడ్ భద్రత గురించి తీసుకోవ్వలసిన జాగ్రత్తలు గురించి చెపుతూ రోడ్ ప్రమాదాలలో జరిగిన సంఘటనలై చూపుతూ అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి భద్రతలు తీసుకోవాలో చెప్పారు. గురునానక్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం సమాజంపై, ముఖ్యంగా యువతపై ఎలాంటి దుష్ప్రభావాన్ని చూపుతుందో ఆ విషయాన్నీ విద్యార్థులకు మరియు సిబ్బందికి అవగాహనా కల్పించే కార్యక్రమాలు చేస్తున్నందుకు పోలీస్ శాఖ అధికారులను అయన సందేశం ద్వారా అభినందించారు. డ్రగ్స్ దుర్వినియోగాన్ని నిర్మూలించేందుకు చేసే ప్రతి ప్రయత్నంలో గురునానక్ సంస్థలు కట్టుబడి ఉన్నాయని తమ సహకారం ఎప్పుడు ఉంటుందని తెలియచేసారు. మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ హెచ్.ఎస్. సైనీ, విద్యార్థులను ఉద్దేశించి తన సందేశం ద్వారా 'ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన పౌరుడిగా ఉండాలనే స్పృహ కలిగి ఉండాలని మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం మనమందరం కలిసి పనిచేయాలని అన్నారు. గురునానక్ విద్యాసంస్థలు విద్యార్థులలో రోడ్డు భద్రత పట్ల అవగాహనా కల్పించడంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని నివారించడానికి అంకితభావంతో ఉన్నాయని ఆయన అన్నారు. ఈ అవగాహన సదస్సులో 1500 మందికి పైగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గురునానక్ యాజమాన్యం తరఫున పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు ధన్యవాదాలు తెలుపుతూ శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కొడుగంటి వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.పార్థసారథి మాట్లాడుతు క్యాంపస్‌లో ఇలాంటి డ్రగ్స్ దుర్వినియోగం మరియు రోడ్డు భద్రత కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించినందుకు గురునానక్ యాజమాన్యం తరపున పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియచేసి వారిని శాలువాలతో సత్కరించారు.

## రేపే గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్ష

- ప్రిన్సిపల్ కూకుట్లయాదయ్య
- విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
- హాల్ టికెట్‌లో ఏమైనా తప్పులు ఉంటే మార్చుకునే అవకాశం



**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండల కేంద్రంగా కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల శంషాబాద్ నందు 11 ఫిబ్రవరి 2024 ఆదివారం ఉదయం 11 గంటలకు ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష జరగనుందని ప్రిన్సిపల్ కూకుట్ల యాదయ్య తెలియజేశారు. ఈ పరీక్షకు ఇప్పటికే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం జరిగిందని, హాల్ టికెట్ లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల శంషాబాద్ ప్రవేశపరీక్ష కేంద్రంగా ఉన్నట్లయితే యాచారం మండల కేంద్రంలోని డేవిడ్ మెమోరియల్ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు హాజరై పరీక్ష వ్రాయవలసి ఉంటుందని ప్రిన్సిపల్ తెలియజేశారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి, తమ పిల్లలను సకాలంలో పరీక్ష కేంద్రానికి తీసుకొని రావాలని ఆయన సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్, ప్యాడ్ వంటివి మరిచిపోకూడదని, ఒకవేళ హాల్ టికెట్లో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే తగు ఆధారాలు చూపించి మార్చుకునే అవకాశం కల్పిస్తున్నామని ప్రిన్సిపల్ తెలియజేశారు.

## మాల్ గ్రామాభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు

### హర్షం వ్యక్తం చేసిన మాజీ సర్పంచ్ పడకంటి కవిత శేఖర్ గౌడ్

**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండలం మాల్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కి సిసి రోడ్లు నిర్మాణానికై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి రూ. 25 లక్షలు మంజూరు చేయడం తో మాజి సర్పంచ్ పడకంటి కవిత శేఖర్ గౌడ్ హర్షం వ్యక్తం చేసి,ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు త్వరలోనే సిసి రోడ్లు రెండు మూడు రోజుల్లో ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయం గ్రామ ప్రజలకు సంతోషకరమైన విషయం అని అన్నారు.





## 96.88 కోట్లు

**మొదటిపేజీ తరువాయి..**

పోలిస్తే ఈసారి రిజిస్టర్ అయిన ఓటర్ల సంఖ్య 6 శాతం పెరిగిందని పేర్కొంది. ప్రపంచంలోనే అత్యధికంగా 96.88 కోట్ల మంది ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. కాగా, ఏప్రిల్-మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి.

## ఒడవని ఓటుకు నోటు కేసు

**మొదటిపేజీ తరువాయి.**

కేసులు నమోదైనట్లు పిటిషనర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

**స్పందన ఎలా ఉంటుందో..?**

కాంగ్రెస్ అధికారం చేపట్టిన 100 రోజుల్లో గత ప్రభుత్వం చెప్పినట్లు విన్న పోలీసు అధికారులందరిని నగ్నంగా పరేడ్ చేస్తా అని గతంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వివరాలను కూడా ధర్మాసనంకు పిటిషనర్ అందజేశారు. పిటిషనర్ వాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యక్తిగతంగా సీఎం రేవంత్ రెడ్డి, ఇతర ప్రతివాదులకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులకు నాలుగు వారాల్లో స్పందించాలని అందులో పేర్కొంది. అయితే.. రేవంత్, తెలంగాణ ప్రభుత్వం ఈ నోటీసులను ఎలా తీసుకుంటుంది..? స్పందన తర్వాత ఏం జరగబోతోంది..? అనే దానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## బీఆర్ఎస్‌లో జూనియర్ ఆర్టిస్టులు

**మొదటిపేజీ తరువాయి..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాద తీర్మానంపై మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ స్నేహంతో ఉన్నాయని రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ సొంత పార్టీ నేతలకు కూడా ముఖ్యమైన విషయాలు చెప్పరని.. బీఆర్ఎస్ నేతలకు అనుమానం ఉంటే తన దగ్గరకు వచ్చి కలిస్తే అన్ని వివరిస్తానని మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉండగా కొంత మంది మంత్రులు అవిశ్వాసం ప్రకటించి.. కేటీఆర్‌ను సీఎం చేయాలని చూశారని విమర్శించారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక కేసీఆర్ మోదీ దగ్గరకు వెళ్లి కేటీఆర్‌ను సీఎం చేస్తానని చెప్పారని అన్నారు. అందుకు అనుమతి కూడా కోరారని చెప్పారు. ఈ విషయాన్ని మోదీనే స్వయంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మోదీ తీసుకువచ్చిన చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిన విషయాన్ని కూడా రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.క్రిష్ణా నదీ జలాలు, ఆ నదిపై ఉన్న ప్రాజెక్టులు క్రిష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిందన్న వాదనను రేవంత్ రెడ్డి ఖండించారు. 2014 నుంచి 23 వరకూ కేఆర్ఎంబీ సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు కేసీఆర్ వెళ్లారని.. తాము ఇంత వరకూ ఏ సమావేశాలకు వెళ్లలేదని అన్నారు. ప్రాజెక్టులను కేంద్రం ఆధీనంలోకి తీసుకుంటాన్న మోదీకి వ్యతిరేకంగా ఢిల్లీకి వెళ్లి ఆమరణ నిరాహార దీక్ష చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు.



## ప్రజా చైతన్యం కోసమే గావ్ చలో అభియాన్

**బోసుపల్లి ప్రతాప్**

**ఇబ్రహీం పట్నం -ప్రభాత సూర్యుడు :** బీజేపీ ఆధ్వర్యంలో దేశావ్యాప్తంగా జరుగుతున్న "గావ్ చలో అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామంలో శుక్రవారం క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారై అంగన్వాడీ టీచర్లను, పారిశుధ్య కార్మికులను, పాఠశాలలోని విద్యార్థులను కలిసి వారు ఎదుర్కుంటున్న సమస్యలు, తదితర అంశాల గురించి చర్చించడం జరిగింది. కేంద్రప్రభుత్వ పథకాలను ఇంటింటికి ప్రచారం చేసి సమాజంలోని చివరి వ్యక్తి వరకు తీసుకెళ్లడం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి బిజెపి గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని చేపడుతుందని బోసుపల్లి ప్రతాప్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను కార్యకర్తలతో కలిసి ఇంటింటా తిరుగుతూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలకు సంబందించిన మెటీరియల్, కంబాక్స్ 10వ తరగతి విద్యార్థులకు బోసుపల్లి ప్రతాప్ తన స్వంత ఖర్చులతో విద్యార్థులకు పంపిణి చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహిస్తూ, ఇష్టంతో చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి, తమ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. వచ్చే పరీక్షలలో ఉత్తమ ప్రదర్శనగా ప్రథమ, ద్వితీయ స్థానం కనబరిచిన విద్యార్థులకు పారితోషికం ఇవ్వడం జరుగుతుంది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి కంబాలపల్లి, శ్రీశైలం, శ్రీకాంత్ రెడ్డి బుస్సు, అంజన్ రెడ్డి మంకాల, రవి, శ్రీకాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సెక్రటేరియట్‌లో చీకటి కోణాలు!

**మొదటిపేజీ తరువాయి..**

పేర్కొన్నారు. అందులో జీఎస్‌టీ మొత్తం కూడా ఉన్నట్టు అప్పట్లో ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు. ఆ తర్వాత రూ. 611 కోట్లకు అంచనాలు పెంచారు. శంకుస్థాపన చేసిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు భవనానికి సంబంధించి పలు అంశాల్లో సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు పోయారు. సచవాలయ భవనం ప్లాన్ అనేక మార్పులు, చేర్పులు చేశారు. ఆస్కార్ అర్కిటెక్స్ కంపెనీ సచివాలయాన్ని డిజైన్ చేసింది. షాపూర్జీ-పల్లోంజీ సంస్థ నిర్మించింది. తొలుత 2022 , అక్టోబర్ దసరా పండుగ రోజున సచివాలయాన్ని ప్రారంభించాలని అనుకున్నారు. అయితే నిర్మాణం ఆలస్యం కావడంతో గత ఏడాది ఏప్రిల్ 30 ప్రారంభించారు. మే 30 నుంచి సచివాలయం అధికారికంగా విధుల్లోకి వచ్చింది. సచివాలయం చుట్టుతా నిర్మించిన దేవాలయం, మసీదు, చర్చీ ఖర్చు కూడా తొలుత డీపీఆర్‌లో చేర్చలేదు. కొత్తగా రోడ్లు సైతం చివరలో వేయాల్సి వచ్చిందనీ, దీంతో సచివాలయం భవన నిర్మాణం ఖర్చు తడిసిమోపెడైందని అంచనా వేస్తున్నారు. సెక్రటేరియట్ నిర్మాణంమొత్తం ఖర్చు రూ. 1440 కోట్ల దాకా అయినట్టేనని అధికారులు అంటున్నారు. ఇదిలావుండగా సచివాలయంలో ఇప్పటికీ చేయాల్సి పనులు ఇంకా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.



మొత్తంత ఖర్చులో రూ. 100 కోట్లు ఫర్నీచర్‌కే ఖర్చు చేయడం గమనార్హం. అలాగే జీఎస్టీ మొత్తం రూ. 100 నుంచి రూ. 150 కోట్లు ఉందని చెబుతున్నారు. కీలకమైన నెట్‌వర్కింగ్ ఖర్చు మాత్రం రూ. 300 కోట్లు .. నిధులు ఎలాంటి టెండర్లు లేకుండా ఖర్చుపెట్టారని అంటున్నారు. సచివాలయం ప్రారంభానికి అప్పటి ప్రభుత్వం తొందరపడిందనీ, పనులు పూర్తికాకముందే చేసిందనే వ్యాఖ్యానాలు అప్పట్లోనే వచ్చాయి. టెండర్లు పిలిచే సమయం లేకపోవడంతో కంపెనీల నుంచి నేరుగా కంప్యూటర్లు, ఇతర పరికరాలు కొనాల్సి వచ్చిందని ఐటీ శాఖ ఉన్నతాధికారు కంగారు పడుతున్నారు. విచారణకు ఆదేశిస్తే.. కొంత మంది అధికారులు ఇబ్బంది పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# అంతా 'రామ'మయం!

- ఫార్ములా ఈ - రేసింగ్‌పై నిజానిజాలు
- కేటీఆర్ ఆదేశాలతోనే రేసుల నిర్వహణ
- రెవెన్యూ స్పెషల్ సీఎస్ అరవింద్ వివరణ

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : ఫార్ములా ఈ-రేసింగ్ వ్యవహారంపై ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు రెవెన్యూ స్పెషల్ సీఎస్ అరవింద్ కుమార్ రిప్లై ఇచ్చారు. మొత్తం 9 ప్రశ్నలకు తన రిపోర్ట్‌లో సమాధానం ఇచ్చారు అరవింద్ కుమార్. సీజన్-9, 10 రేసింగ్‌లు నిర్వహించేందుకు.. జనవరి-2022లో ఈ,0తో ఒప్పందం చేసుకున్నట్టు చెప్పారు. ఈ ఒప్పందానికి పూర్తి బాధ్యత నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్‌దేనని తన రిప్లైలో స్పష్టం చేశారు. 2023, ఫిబ్రవరి 10,11 తేదీల్లో సీజన్-9 రేసింగ్ నిర్వహించామని వివరించారు అరవింద్ కుమార్. సీజన్-10 హోస్ట్ సిటీగా హైదరాబాద్‌ను పోటీలో పెట్టాలని కేటీఆర్ నిర్ణయించారని..అయితే ప్రమోటర్లు ముందుకు రాకపోవడంతో.. ఊఓఆం బాధ్యత తీసుకోవాలని చెప్పారని అరవింద్ కుమార్ వివరించారు .హోస్ట్‌సిటీ కోసం రెండు విడతల్లో రూ.53 కోట్లు చెల్లింపులు జరిగినట్టు తన వివరణలో చెప్పారు. తొలి విడతలో 45 కోట్లు చెల్లించగా..పన్నుల రూపంలో మరో 8 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. కేటీఆర్ ఆదేశాలతోనే 2023 అక్టోబర్ 5, 11 తేదీల్లో చెల్లింపులు జరిగాయన్నారు. ఫార్ములా ఈ-రేసింగ్‌కు సంబంధించిన ప్రతి నిర్ణయం కేటీఆర్‌దేనని.. కేటీఆర్ ఆదేశాలతోనే సెప్టెంబర్ 25, 2023లో ఈఖాతో సీజన్ 10 కు ఒప్పందం చేసుకున్నామని అరవింద్ కుమార్ రిప్లై ఇచ్చారు.

# భూపత్రాలు చోరీకి యత్నం

నాగర్ కర్నూలు - ప్రభాతసూర్యుడు : తహసీల్దార్ కార్యాలయంలో ఇంటి దొంగలు పడ్డారు. అడ్డంగా దొరికిపోయారు. నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో ఘటన జరిగింది. గురువారం అర్ధరాత్రి సమయంలో రెవెన్యూ ఉద్యోగి హన్మనీత్ తో కలిసి బొమ్మనపల్లి తాజా మాజీ సర్పంచ్ బోడుక నాయక్ తాహసీల్దార్ కార్యాలయంలో భూములకు సంభందించిన విలువైన పత్రాలను దొంగిలించాడానికి వచ్చారు. కార్యాలయంలో వారున్న సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకుని ఇద్దరిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారిస్తున్నారు.



# మల్కాజిగిరికి మహా డిమాండ్!

- ఎంపీ స్థానానికి యమ గిరాకీ
- బీజేపీలో పెరుగుతున్న ఆశావహులు
- అభ్యర్థుల ఎంపిక గగనమేననే చర్చ
- రాజీ కోసం మొదలైన రాయబారాలు



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : బీజేపీలో సీనియర్ నేతలు టికెట్ ఫైట్ చేస్తుండడంతో మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం హాట్‌టాపిక్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండుచోట్లా పోటీచేసి ఓడిపోయిన ఈటల రాజేందర్ మల్కాజ్‌గిరిలో పోటీకి సై అంటున్నారు. మరోవైపు బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు మల్కాజ్‌గిరిలో ప్రచారం కూడా మొదలుపెట్టారు. ఇక వరంగల్ మాజీ ఎంపీ చాడ సురేశ్ రెడ్డి కూడా మల్కాజ్‌గిరి సీటుపై భారీ ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన కూన శ్రీశైలం గౌడ్, సామ రంగారెడ్డి, రాంచందర్‌రావు కూడా పోటీకి సై అంటున్నారు. ఈటల రాజేందర్, చాడ సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్‌లు ఇప్పటికే ఢిల్లీ పెద్దలను కలుస్తూ తమ వినతిని పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తులు చేస్తున్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గతంకంటే మెరుగైన ఫలితాలు సాధించింది. సీనియర్ నేతలంతా ఓడినప్పటికీ.. ఆ పార్టీ నుండి 8 మంది అభ్యర్థులు అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఓటు శాతం కూడా భారీగా పెంచుకుంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఆదరణ ఎక్కువగా ఉంటుందని ధీమా కూడా పార్టీలో ఉంది. అటు కేంద్రంలో కూడా హ్యాట్రిక్ ఖాయమని బలంగా నమ్ముతున్నారు..కమలం నేతలు. మల్కాజ్‌గిరిలో ఉత్తరాది ఓటర్ల ప్రభావం అధికంగా ఉండడంతో మోదీ ఫ్యాక్టర్ కూడా పనిచేసే అవకాశం ఉంది. దీంతో మల్కాజ్‌గిరి ఎంపీ టికెట్ కోసం జాతీయ స్థాయిలో పైరవీలు మొదలుపెట్టారు..కాషాయం నేతలు. 2009లో ఏర్పాటైన మల్కాజ్‌గిరి స్థానం.. 30 లక్షలకు పైగా ఓటర్లతో అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గంగా రికార్డు దక్కించుకుంది. దేశంలోని అన్నిప్రాంతాల ప్రజలు ఇక్కడ నివసిస్తుండడంతో ఈ నియోజకవర్గంలో పట్టు సాధించడం అంతసులువైన పనికాదు. అయినా ఇక్కడ నుంచి బరిలోకి దిగేందుకు అన్ని పార్టీల నుండి తీవ్రమైన పోటీ ఉంది. మల్కాజ్‌గిరి నుండి గెలుపొందినవారికి రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉంటుందన్న సెంటిమెంటు కూడా .. నేతల మధ్య పోటీకి కారణమవుతోంది. టికెట్ కోసం బీజేపీ ముఖ్య నేతలు పోటీ పడుతుండటంతో ఇక్కడ అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి సవాల్‌గా మారింది. మరి బీజేపీ అధిష్ఠానం ఎవరివైపు మొగ్గుచూపుతుందన్నది ఆసక్తిగా మారింది.

# రేషన్ షాపుల్లోనూ ఆన్‌లైన్ విక్రయాలు



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : రేషన్ షాపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ కంపెనీలు రానున్న రోజుల్లో గట్టి పోటీని ఎదుర్కోవాల్సి రావచ్చు. నాణ్యమైన నిత్యావసర వస్తువులను ప్రభుత్వ రేషన్ షాపుల ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయించవచ్చా అన్న విషయంపై ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రయోగం చేస్తోంది. టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్ట్ ప్రకారం, ొాఔఆఅలో, చౌక ధరల దుకాణాల ద్వారా ఆన్‌లైన్‌లో వినియోగదారు ఉత్పత్తులను (సబ్బులు, షాంపూలు వంటివి) విక్రయించే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం టేబుల్ మీద ఉంది. ొాఔఆఅ అనేది కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్. దీనిని ఇ-కామర్స్ జఖఎ అని కూడా పిలుస్తారు. మన దేశంలో ఇ-కామర్స్ రంగంలో పాతుకుపోయిన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి కంపెనీల ఆధిపత్యానికి ముగింపు పలికేందుకు ొాఔఆఅని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.రేషన్ షాప్ లేదా చౌక ధరల దుకాణంలో నిరుపేదల కోసం బియ్యం, గోధుమలు, తృణధాన్యాలు, పప్పులు, పంచదార, మరికొన్ని వస్తువులను అతి తక్కువ ధరలకు కేంద్ర ప్రభుత్వం విక్రయిస్తుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ (ఖఆూ) కింద రేషన్ షాపులు పని చేస్తున్నాయి. ప్రస్తుతం మన దేశంలో ఐదున్నర లక్షలకు పైగా పీడీఎస్ దుకాణాలు పని చేస్తున్నాయి, 80 కోట్లకు పైగా ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. ఇంత పెద్ద ప్రజా పంపిణీల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని, కన్జ్యూమర్ ప్రొడక్ట్స్‌ను ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా అందించే పనిని కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పరిశీలిస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా, హమీర్‌పూర్ జిల్లాల్లో ఈ ప్రయోగం కొనసాగుతోంది.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పరీక్ష విజయవంతమైతే, రానున్న రోజుల్లో ప్రజలు పీడీఎస్ షాపుల నుంచి ఆన్‌లైన్ ద్వారా అనేక రకాల వస్తువులను కొనుగోలు చేయవచ్చు. టూత్ బ్రష్‌లు, సబ్బులు, షాంపూలు వంటివి ఆ దుకాణాల్లో అందుబాటులో ఉండవచ్చు.

# ఏఐ సిటీగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..

మొదలు పెట్టారు. ఇలా హైదరాబాద్ లో మరో సరికొత్త నగరం ఆవిష్కృతమైంది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని అదే స్థాయిలో అభివృద్ధి చేస్తూ వచ్చారు. సైబరాబాద్ విస్తరిస్తూనే ఉంది. మారుతున్న టెక్నాలజీతోపాటు నగర పరిధి కూడా మారాల్సి వచ్చింది. అందుకే దీన్ని మరింతగా విస్తరించి సరికొత్త నగరాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించినట్టు గవర్నర్ తన ప్రసంగంలో తెలియజేశారు. గవర్నర్ ప్రసంగంలో ఏమన్నారంటే..." నా ప్రభుత్వం కొత్త సాంకేతికతను ముఖ్యంగా కృత్రిమ మేధా శక్తిని వినియోగించుకోవాలని దృఢ నిశ్చయంతో ఉంది. ప్రపంచ అగ్రగామి సంస్థలు, అలాగే జాతీయ సాంకేతిక కంపెనీలను తమ కృత్రిమ మేధా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆహ్వానించడం ద్వారా దేశంలోనే హైదరాబాద్‌ను, తెలంగాణను కృత్రిమ మేధస్సుకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. మా ప్రభుత్వం కృత్రిమ మేధా సిటీని 50-100 ఎకరాల్లో ఏర్పాటు చేస్తుంది. నేడు మన సమాజంలో డిజిటల్ అనుసరణ శరవేగంగా జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం డిజిటల్ అవకాశాల నుంచి పూర్తిగా ప్రయోజనం పొందడమే కాకుండా కొత్త సాంకేతికతలలో దేశంలోనే అగ్రగామిగా ఎదగవలసిన అవసరం ఉంది. ఇంటర్నెట్‌ను ఒక ప్రాథమిక హక్కుగా ప్రవేశ పెట్టడం అనేది, మా ప్రభుత్వం చేపట్టబోయే ముఖ్యమైన కార్యక్రమాల్లో ఒకటి. కేవలం డిజిటల్ మౌలిక సదుపాయాలను సృష్టించడమే కాకుండా సమాజంలోని అనని వర్గాలకు కనీస ధరలకే అందుబాటులోకి తేవడంపై దృష్టి పెట్టబోతున్నాం. ప్రతి కుటుంబం వేగవంతమైన డిజిటల్ అనుసరణ అవకాశాల ద్వారా వచ్చే ప్రయోజనం పొందేందుకు ఒక సార్వజనీన సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని మా ప్రభుత్వం అమలు చేస్తుంది అని అన్నారు.

# పీవీ భారత రత్న

మొదటిపేజీ తరువాయి..

కేంద్ర ప్రభుత్వం. ఈ సందర్భంగా వీళ్ల సేవల్ని గుర్తు చేసుకున్న ప్రధాని మోదీ. పీవీ నరసింహా రావు ఓ మేధావి అంటూ ప్రశంసలు కురిపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగానే కాకుండా కేంద్రమంత్రిగానూ తన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించారని అన్నారు. అటు ఎంపీగానూ ఎన్నో ఏళ్లుగా సేవలందించారని చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పిన వ్యక్తి అంటూ కొనియాడారు. దేశ అభివృద్ధికి బలమైన పునాది వేశారని అన్నారు. ప్రధానిగా ఆయన అందించిన సేవల్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటామని వెల్లడించారు. మరో మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్‌కీ భారత-రత్న ఇస్తున్నట్టు ప్రకటించారు ప్రధాని మోదీ. దేశానికి ఆయన అందించిన సేవలకు లభించిన సత్కారమని వెల్లడించారు. రైతుల సంక్షేమం, హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని ప్రశంసించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, దేశ హోం మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆయన అందించిన సేవల్ని స్మరించుకున్నారు. ఎమర్జెన్సీ రోజులకు ఎదురు నిలిచి ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని



గుర్తు చేసుకున్నారు. ఆయన దేశానికి స్ఫూర్తిదాయకం అని అన్నారు.ఇక హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్ ఎస్ స్వామినాథన్ సేవల్నీ గుర్తు చేసుకున్నారు ప్రధాని నరేంద్ర మోదీ. దేశ వ్యవసాయ రంగానికి, రైతులకు ఆయన అందించిన సేవలను ఇలా గౌరవించుకుంటున్నట్టు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో భారత్ ఆత్మ నిర్భరతతో నిలబడడానికి కారణం స్వామినాథన్ అంటూ ప్రశంసించారు. ఆయన కేవలం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా...ఆహార భద్రతనూ కల్పించారని అన్నారు.



# ఆన్‌లైన్‌లో మేడారం మొక్కులు

వరంగల్, ప్రభాతసూర్యుడు : వన దేవతలు సమ్మక్క - సాలరమ్మ జాతకు మేడారం సిద్ధమైంద. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు ఉంది. ఈ జాతరకు భారీగా భక్తులు తరలివస్తారు. ఇప్పటికే నిత్యం లక్షకు పైగా భక్తులు మేడారం వెళ్లొస్తున్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈసారి ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రూ.100 కోట్లకుపైగా ఖర్చుచేసి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఏర్పాట్లను మంత్రి సీతక్క స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.ఈసారి మేడారం జాతరకు కోటి మందికిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు తగినట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక మేడారం అనగానే అందరికీ గుర్తొచ్చేది బంగారం(బెల్లం). జాతరకు వెళ్లే భక్తుల్లో 60 శాతం మంది నిలువెత్తు బంగారం అమ్మవారికి సమర్పిస్తారు. అయితే వివిధ కారణాలతో కొందరు జాతరకు వెళ్లలేని పరిస్థితిలో ఉంటారు. దీంతో అమ్మవారి మొక్కు చెల్లించుకోలేకపోతున్నామే అని బాధపడుతుంటారు. వారికోసం ఈసారి దేవాదాయ శాఖ ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెట్టింది.మేడారం వెళ్లలేని, వెళ్లడం వీలుకాని భక్తులు ఇప్పుడు ఇంట్లో నుంచే తమ మొక్కును చెల్లించుకోవచ్చు. ఎత్తు బంగారం(బెల్లం) మొక్కు చెల్లించుకునేందుకు టియాప్ ఫోలియో, మీ సేవ, పోస్టాఫీస్ ద్వారా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ముందుగా తాము ఎంత బరువు ఉన్నామో లెక్కించుకుని ఆ బరువుకు తగినట్లుగా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం మేడారంలో బెల్లం కిలో ధరను రూ.60గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు తమ బరువును బట్టి డబ్బులు చెల్లించాలి. ఉదాహరణకు బరువు 60 కిలోలు ఉంటే కిలోకు రూ.60 చొప్పున రూ.3,600 చెల్లించాలి. మీసేవ, సర్వీస్ చార్జీలు అదనం. ఈ సేవలను జిల్లా మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు.

**పోస్టాఫీస్ ద్వారా ప్రసాదం..**

ఇక మేడారం వెళ్లలేని భక్తులు పోస్టాఫీస్ ద్వారా వన దేవతల ప్రసాదం పొందే అవకాశం కూడా దేవాదాయ శాఖ కల్పిస్తోంది. ఇక మేడారం వెళ్లి నిలువెత్తు బంగారం సమర్పించేవారు తప్పకుండా ఆధార్ కార్డు తీసుకెళ్లాలి. అక్కడ బెల్లం కొనాలంటే ఆధార్ కార్డు జిరాక్స్ తప్పకుండా ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు.

# నల్ల కండువాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

## మార్షల్స్ తో వాగ్వాదం

హైదరాబాద్- ప్రభాతసూర్యుడు : శుక్రవారం నాడు శాసనమండలి ఆవరణలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. నల్ల కండూవాలతో వచ్చిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీలను మార్షల్స్ అడ్డుకున్నారు. నల్ల కండువాలు వేసుకొని రావడానికి వీలులేదని నిలువరించారు. నిరసన తెలపడం మా హక్కు..కావాలంటే సస్పెండ్ చేసుకోండి అంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు సభలోకి వెళ్లారు.





# ఎవరిని ఎంపిగ నిలబెడదాం..?

మొదటిపేజీ తరువాయి..

ఎన్నికల్లో సిట్టిం గులకు టికెట్ ఇవ్వొద్దని విశ్లేషకులు పార్టీ నేతలు సూచించినా కేసీఆర్ ఎవరి మాట వినలేదు. దీంతో చివరకు పార్టీకి ఓటమి తప్పలేదు. ఈ సారి అలా జరగకుండా జాగ్రత్త పడుతున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ సిట్టింగులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. చివరి నిమిషంలో 12 స్థానాల్లో కొత్తవారిని నిలిపారు. అయితే ఆ ఎన్నికల్లో సిట్టింగుల్లో సగానికిపైగా ఓడిపోయారు. ఇక కొత్తగా ప్రకటించిన 12 మందిలో 10 మంది విజయం సాధించారు. ఈ నేపథ్యంలో సిట్టింగులకు టికెట్ ఇవ్వడం ఎంత పెద్ద తప్పో గులాబీ బాస్‌కు తెలిసి వచ్చింది. కానీ, అప్పటికే జరగకూడని నష్టం జరిగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోక్‌సభలో రిపీట్ కాకుండా కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారులోక్‌సభ ఎన్నికల్లో సిట్టింగులందరినీ పక్కన పెట్టాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మంచి ఇమేజ్ ఉన్న సిట్టింగులకు టికెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ 9 ఎంపీ సీట్లు గెలిచింది. అందులో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలగా గెలిచారు. ఎంపీ సీటుకు రాజీనామా చేశారు. ఇక పెద్దపల్లి ఎంపీ మూడు రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 8 మంది ఎంపీలే ఉన్నారు. వెంకటేశ్‌నేత రాజీనామా ఆమోదిస్తే ఆ బలం ఏడుకు తగ్గుతుంది. ఈసారి అన్ని స్థానాల్లో ఫ్రెషర్స్‌ను పోటీ చేయిస్తే బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకత కాస్తయినా తగ్గుతుందని గులాబీ బాస్ భావిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా ఎంపీ టికెట్ ఇచ్చే అవకాశం లేదని తెలుస్తోంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## వైభవంగా మామిడిపల్లిలో జాతర



**సిరిసిల్ల - ప్రభాతసూర్యుడు :** మాఘ అమావాస్య సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం దత్తత దేవాలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. స్వామివారిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేములవాడ దేవస్థానం మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దత్తత తీసుకున్నప్పటినుండి ఆలయం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, గ్రామ కమిటీ వారు సైతం అభివృద్ధిలో పాలు పంచు కుంటు న్నారని, స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు.

# సంపాదకీయమ్..

## జాతీయ సమస్యగా వాయు కాలుష్యం

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అరుదుగా మాత్రమే నీలి ఆకాశం కనబడుతోంది. గాలి నాణ్యత తీవ్రతకు ఇదొక సంకేతం. వాయు కాలుష్యం ఇప్పుడు జాతీయ సమస్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, గాల్లోని నలుసు పదార్థాల (పీఎం) సాంద్రత 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రో గ్రాములు మించకూడదు. ఇది ఢిల్లీ లాంటి నగరంలో 102. ఈ గాలిని పీల్చడం ప్రాణాంతకం. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి తెచ్చిన 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం' కొంతమేరకు ఫలితమిస్తున్నా అది సరిపోదు. మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో మనం వ్యవహ రిస్తున్నాం. ప్రజారోగ్య దృక్కోణం నుండి చూస్తే ఎంత ప్రగతి అయినా తక్కువే. నిరంతర రాజకీయ నిబద్ధత మాత్రమే మెరుగైన ఫలితాలను ఇస్తుంది. శీతకాలపు నెలల్లో భారీ పొగమంచుతో కప్పబడి ఉండే ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో నీలి ఆకాశం, ప్రకాశవంతమైన సూర్యబింబం అరుదుగా గోచరిస్తుంటాయి. అయితే పేలవమైన గాలి నాణ్యత అనేది ఇప్పుడు జాతీయ సమస్య అయింది. కాకపోతే గత ఐదేళ్లలో, వాయు కాలుష్యం ఒక విధానపరమైన సమస్యగా కూడా గుర్తింపు పొందింది. అయిన ప్పటికీ 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమ' (ఎన్‌సీఏపీ) అయిదేళ్ల అంచనాను పరిశీలిస్తే, అర్థవంతమైన, శాశ్వతమైన ప్రయోజనాలను అందించడానికి గట్టి ప్రయత్నాలు అవసరమని తెలుస్తుంది.అపఖ్యాతి పాలైన భారతదేశ గాలి నాణ్యతను పరిష్కరించడానికి తెచ్చిన మొదటి విధానం ? 2019లో ప్రారంభించిన ఎన్‌సీఏపీ. కాలుష్య స్థాయులను, గాలిలోని నలుసు పదార్థాల గాఢతలను ప్రధాన నగరాల్లో 30 నుంచి 20 శాతం తగ్గించాలనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించింది. దీనికి కేంద్రం నుండి రూ. 443 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుండి రూ. 4,400 కోట్ల ప్రారంభ కేటాయింపులు జరిపారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి చెందిన నిరంతర పరిసర వాయు నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాల విశ్లేషణ (భారత దేశ వాయు నాణ్యతా మానిటర్ల నెట్‌వర్క్) పురోగతి స్థిరంగా ఉన్నప్ప టికీ, ఎన్‌సీఏపీని అమలు చేయడంలో వ్యూహాత్మకమైన, సైన్స్ ఆధారిత మార్పుల అవసరం ఉంది. ఉదాహరణకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ గాల్లోని నలుసు పదార్థాల (పర్టిక్యులేట్ మ్యాటర్) సాంద్రతకు పరిమితులు నిర్దేశించింది. 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాములు, 10 పీఎం అయితే ఒక క్యూబిక్ మీటరుకు 15 మైక్రోగ్రాములు మించకూడదు.ఎన్‌సీఏపీ అమలయ్యాక, ప్రత్యేకించి 2.5 పీఎం వారణాసిలో 96 నుంచి 26.9 మైక్రోగ్రాములకు తగ్గింది. ఆగ్రాలో 73 నుంచి 33కు, జ్యోద్‌పూర్‌లో 81.8 నుంచి 40.6కు మెరుగ్గా తగ్గింది. కానీ ఢిల్లీలో మాత్రం 108 నుంచి 102కు మాత్రమే తగ్గింది. పీఎం 2.5 స్థాయుల డేటా 2019?2023 మధ్య 46 నగరాలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేవలం 27 నగరాల్లో మాత్రమే తగ్గుదల మెరుగ్గా ఉంది. 10 పీఎం విషయంలో ఐదేళ్ల డేటా కేవలం 46 నగరాలకు అందుబాటులో ఉండగా, అందులో కేవలం 24 నగరాల్లో మాత్రమే మెరుగుదల కనబడింది.50 శాతం నగరాలు గణనీయమైన అభివృద్ధిని చూపుతున్నా యనీ, ఇది ఎన్‌సీఏపీ విజయవంతమైన ప్రగతిని సూచిస్తోందనీ ఎవరైనా వాదించవచ్చు. కానీ మనం మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో వ్యవహరిస్తున్నాము. పైగా రక్తపోటు, మధుమేహం వంటివాటిని ఇవి మరింత తీవ్రతరం చేయవచ్చు. 2.5 పీఎం రక్త?మెదడు అవరోధాన్ని కూడా దాటవచ్చు. దీర్ఘకాలం అలాంటి గాలిలో మసలితే ప్రాణాంతకం అవుతుంది. కాబట్టి, ప్రజారోగ్య దృక్పథం నుండి చూస్తే మరింత కఠినమైన ప్రగతి అత్యవశ్యం.మరో సమస్య ఏమిటంటే, ఎన్‌సీఏపీలో సమన్వయం కొరవడింది. ఢిల్లీ లాంటి నగరంలో సరి?బేసి ట్రాఫిక్‌ను అమలు చేయడం, 'జాతీయ రాజధాని ప్రాంతం' నుండి నిబంధనలు పాటించని వాహనాలను తొలగించడం, వ్యర్థాలను బహిరంగంగా కాల్చడాన్ని నిరోధించడం, దుమ్మును తగ్గించడానికి రోడ్లపై నీటిని చల్లడం వంటి చర్యలు అన్నీ అమలవుతున్నాయి. అయినప్పటికీ, కాలుష్యానికి సంబంధించిన ఇవే కారణాలు ఉన్న మిగిలిన ప్రాంతాలకు విస్తరించకుంటే ఈ చర్యలు సరిపోవు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలో పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల దట్టమైన పొగమంచుతో చలి కాలం ప్రారంభం కావడం దీనికి స్పష్టమైన ఉదాహరణ.ఢిల్లీ నగరంలో నమోదైన సుమారు 80 లక్షల వాహనాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఉష్ణోగ్రతలో తగ్గుదల గాలిలో నిలిచివుండే అణువుల స్థాయులను ప్రమాదకరంగా పెంచుతుంది. ఈ కాక్‌టెయిల్‌ను ఢిల్లీ నివాసులు ప్రతి సంవత్సరం కొన్ని వారాల పాటు పీల్చుకుంటున్నారు. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) ప్రతి శీతాకాలంలో ఢిల్లీ?జాతీయ రాజధాని ప్రాంతంలో ఊహించిన ప్రతిస్పందనగా అమలులోకి వస్తుంటుంది. అయితే దాని ఆధారాన్ని తగ్గించడమే లక్ష్యం కావాలి.రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సజావుగా సమన్వయం లేకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుంది. జాతీయ రాజధాని వెలుపల, సీపీసీబీ పర్యవేక్షణ నెట్‌వర్క్ అసమానంగా ఉందని మా విశ్లేషణ చూపుతోంది. ఇది మూల్యాంకనానికి వ్యత్యాసాల పొరను జోడిస్తుంది. ముజఫర్‌పూర్, బిహార్ లాంటి రద్దీ ప్రదేశాలలో కేవలం మూడు మానిటర్లు ఉన్నాయి. అదే ఢిల్లీ అంతటా 37 స్టేషన్‌లు,ముంబై అంతటా 22, హైదరాబాద్‌లో 14 స్టేషన్లు ఉన్నప్పుడు మనం తప్పుడు నిర్ధారణలకు వచ్చే ప్రమాదం ఉంది.ప్రామాణిక పర్యవేక్షణ విధానంలో, పోల్చదగిన జనాభా ఉన్న నగరాలు ఒకే విధమైన లేదా కనీసం సారూప్య సంఖ్యలో గాలి నాణ్యత మానిటర్లను కలిగి ఉంటాయి., రంగాల వారీగా వివరణాత్మక చర్యలు ఉండాలి. ఇటుక బట్టీలు, నిర్మాణాలు, కూల్చివేత ప్రాజెక్టుల వంటి అత్యంత కాలుష్య కారకాలకూ... సిమెంట్, ఉక్కు కర్మాగారాలకూ భిన్నమైన విధానం అవసరం. అదేవిధంగా, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం మాత్రమే నిర్దిష్ట వయస్సు దాటిన పెట్రోల్, డీజిల్ వాహనాలను నిషేధించింది. కానీ దేశవ్యాప్తంగా కఠినమైన, కాలుష్య నియంత్రణ వ్యవస్థ లేక పోతే... ప్రమాణాలను అందుకోని వాహనాలను ఇతర నగరాలకు తరలించే ప్రమాదం ఉంది. అప్పుడు కాలుష్య భారం మారదు. మరీ ముఖ్యంగా, ఎన్‌సీఏపీ ప్రధాన అంశంగా ప్రజారోగ్యం ఉండాలి. ప్రతి కొలమానాన్ని తప్పనిసరిగా ప్రతిపాదించాలి, చర్చించాలి. అంతే గాకుండా వాయు కాలుష్య కారకాలను తగ్గించడం పట్ల నిర్మాణా త్మకంగా ఉండాలి.మనం ఎన్‌సీఏపీ రెండవ దశలోకి ప్రవేశించినప్పుడు చాలా ఆశించవచ్చు. ప్రభుత్వం అత్యున్నత స్థాయిలలో సమస్యను అంగీకరించడం అనేది మాత్రం ఇప్పటికి సానుకూలాంశం.

## సదాశివపేట మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

**సంగారెడ్డి-ప్రభాతసూర్యుడు :** సదాశివపేట మునిసిపాలిటీలో ఆవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ జయమ్మకి వ్యతిరేకంగా 22 మంది కౌన్సిలర్లు ఓటు వేసారు. సదాశివపేట నూతన మున్సిపల్ చైర్ పర్సన్ గా బీఆర్‌ఎస్ కౌన్సిలర్ అపర్ణ శివరాజ్ పాటిల్ ని ఎన్నుకునే అవకాశం వుంది. మొత్తం 26 మంది సభ్యులలో అవిశ్వాసానికి అనుకూలంగా 22 మంది ఓటు వేసారు. నలుగురు కౌన్సిలర్లు హాజరు కాలేదు. పార్టీలకు అతీతంగా అపర్ణ శివరాజ్ పాటిల్ కే కౌన్సిలర్లు మద్దతు తెలిపారు.

# పొన్నం వర్సెస్ గంగుల

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :** కరీంనగర్ జిల్లాలో రాజకీయాలు రంజుగా మారుతున్నాయి. రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , మాజీ మంత్రి గంగుల కమలాకర్ మధ్య వార్ జరుగుతోంది. ఎవరికి వారే ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటున్నట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. మొన్నటి వరకు కరీంనగర్ జిల్లాలో గంగులా కమలాకర్ చక్రం తిప్పితే... ఇప్పుడు మంత్రి పొన్నం ప్రభాకర్ వంతు వచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాపై పట్టు సాధించేందుకు పొన్నం ప్రభాకర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.మాజీ మంత్రి గంగుల కమలాకర్ కు చెక్ పెట్టేలా...ఎత్తులు వేస్తున్నారు. ఆ పార్టీ ఈ పార్టీ అనే తేడా లేకుండా నాయకులంతా...అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు వెంకటేశ్వర స్వామి చుట్టూ రాజకీయాలు నడుపుతున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల అంశంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య పోటీ నడుస్తోంది. ప్రతీ ఏటా కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను...మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో జరిగేవి. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీటీడీ నుంచి అర్చకులను పిలిపించి ...ఏనుగు అంబారీల ఊరేగింపుతో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో...ఆ ప్రభావం కరీంనగర్‌లో నిర్వహించే వెంకన్న బ్రహ్మోత్సవాలపై పడింది. బీఆర్‌ఎస్ ప్రతిపక్షానికే పరిమితం అయినా...కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం...గంగుల కమలాకర్ శాసనసభ్యుడిగా గెలుపొందారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే...ఈ సారి కూడా వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెలలోనే నిర్వహించాలని భావించారు. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ రూపంలో సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. నగరానికే చెందిన పొన్నం ప్రభాకర్...హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి దక్కించుకున్నారు. దీంతో కరీంనగర్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలపై పొన్నం ఆరా తీశారు. ఆ ఉత్సవాలను ఈసారి ప్రభుత్వం నిర్వహిస్తుందని ప్రకటించడంతో అసలు కథ మొదలైంది. ఆలయ అధికారులను పిలిపించుకొని పొన్నం మాట్లాడినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఉండగా.. దేవాదాయశాఖ పరిధిలోని ఆలయంలో ఇతరులెలా ఉత్సవాన్ని నిర్వహిస్తారంటూ...అధికారులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఏడు రోజుల పాటు వెంకటేశ్వరస్వామి ఉత్సవాలను మంత్రి హోదాలో పొన్నం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. గతంలో పన్నెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను.. ఇప్పుడు కుదించడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు మంత్రి పొన్నం ప్రభాకర్ పై విమర్శలు చేస్తున్నాయి.

దేవుడు సెంట్రిక్‌గా మంత్రి వర్సెస్ మాజీ మంత్రిగా మారిన రాజకీయాలు...కరీంనగర్‌లో కొత్తేమీకాదు. ఈ ట్రెండ్ దాదాపు 15 ఏళ్ల క్రితమే ప్రారంభమైందట. బండి సంజయ్...బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, కరీంనగర్ ఎంపీగా ఎదగడానికి దైవానుగ్రహమే కారణమని ఆయన చెప్పుకున్నారు. బండి నేతృత్వంలో నిర్మించి, నిర్వహిస్తున్న మహాశక్తి ఆలయ ముగ్గురమ్మల దీవెనలే కారణమని బండి సంజయ్ బలంగా నమ్ముతారు. అంతకుముందు అలాంటి ఆలోచనలు లేని గంగుల...తానూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను మొదలుపెట్టారు. తొలుత గణేష్ నవరాత్రులు, దుర్గా నవరాత్రులను స్టార్ట్ చేసి.. తర్వాత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అన్నీ తానై జరిపే స్థాయికి వెళ్లారు. కరీంనగర్‌లో బీజేపీ స్ట్రాంగ్‌గా ఉన్నప్పటికీ గంగుల విజయం సాధించడానికి...వెంకటేశ్వరస్వామి ఉత్సవాలే కారణమని నమ్ముతారు. గతంలో బండి వర్సెస్ గంగుల సాగిన ఆధ్యాత్మిక రాజకీయాలు...ఇప్పుడు కొత్త టర్న్ తీసుకుని...ట్రయాంగిల్‌గా మారాయి.



# సదరం స్లాట్ల కోసం పడిగాపులు

**ఆదిలాబాద్, ప్రభాతసూర్యుడు :** దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల కోసం స్లాట్ బుక్ చేసుకుంటేనే వైద్య పరీక్షలు నిర్వహిస్తుండడంతో వారంతా మీసేవ కేంద్రాల వద్ద స్లాట్ బుకింగ్ కోసం పడిగాపులు కాస్తున్నారు.
కొత్తగా సదరం సర్టిఫికెట్ పొందాలన్నా.. ఇప్పటికే ఉన్నవారు రెన్యువల్ చేసుకోవాలన్నా స్లాట్ బుకింగ్ తప్పనిసరి. క్యాంపు నిర్వహించే రెండు రోజుల ముందు స్లాట్ బుకింగ్ అవకాశం కల్పిస్తున్నారు. ఓపెన్ చేసిన పది నిమిషాల్లోనే స్లాట్లు అయిపోతు న్నాయి.దీంతో దివ్యాంగులు మీసేవ కేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే క్యూ కడుతున్నారు. ఉదయం 6 గంటలకే జిల్లాలోని మీసేవ కేంద్రాల వద్దకు దివ్యాంగులు చేరుకుంటున్నారు. 10 గం టలకు దరఖాస్తుదారులు తమ పత్రాలు అందించి స్లాట్ బుకింగ్ చేస్తుండగానే క్లోజ్ అయిపోతున్నాయి . దీంతో అప్పటి వరకు నిరీక్షించిన దివ్యాంగులు ఉసూరుమంటు వెనుదిరుగుతున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్, మాంచెరియల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ తదితర మండల కేంద్రాల్లో... సదరం నమోదు కోసం దివ్యాంగులు మీసేవ కేం ద్రాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఒక్కో కేంద్రం లో ఒకటి, రెండు స్లాట్లు మాత్రమే నమోదవుతు. న్నాయి. కొంతమందికే స్లాట్ నమోదవుతుండడం తో మిగతా వారు నిరాశ చెందుతున్నారు.ప్లాట్ల సంఖ్య పెంచాలని దివ్యాంగులు కోరుతున్నారు. అంతే కాక దివ్యాంగులను గుర్తించే క్రమంలో ఎక్కువ శాతం వైకల్యం ఉన్నవారికి శాశ్వత ప్రాతిపదికన, మరికొందరికి కాలపరిమితితో సదరం సర్టిఫికెట్ ఇస్తుంటారు. గడువు ముగిసిన తర్వాత తిరిగి పరీక్ష లు చేయించుకుని మళ్లీ సర్టిఫికెట్ పొందాలి. లేదంటే పింఛన్ మధ్యలో ఆగిపోయే అవకాశం ఉంది. మరోవైపు స్లాట్ బుకింగ్ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.వైకల్యాన్ని నిర్ధారించే క్రమంలోనే కొందరికి పర్మినెంట్ సదరం సర్టిఫికెట్, మరికొందరికి రెండు మూడేండ్ల కాలపరిమితితో



సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. ఇలా రెండు, మూడేండ్ల కాలపరివి సర్టిఫికెట్లు పొందినవాళ్లు..గడువు తీరిన తర్వాత మళ్లీ స్లాట్ బుక్ చేసుకుని వైకల్య నిర్ధారణప చేయించుకోవాల్సి ఉంటుంది. లేదంటే వారికి ఆసరా పింఛన్ ఆగిపోతుంది.దీంతో వారు నెలల తరబడి మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీంతో నెలలు, సంవత్స తరబడి పింఛన్ కోల్పోతున్న బాధితులు వందల్లో ఉన్నారు. ఇది తమ హక్కులను హరించడ ఇప్పటికైనా స్లాట్స్ సంఖ్య పెంచి అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని దివ్యాంగు కోరుతున్నారు.దివ్యాంగులకు స్లాబ్ వ్యవస్థ ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతోందని, స్లాట్ దొరకకపోవడం వల్ల సదరం సర్టిఫికెట్ పొందలేకపోవడం, పింఛన్ రాకపోవడం దివ్యాంగుల చట్టం ఉల్లంఘన కిందకే వస్తుందని కోర్ట్ ఆఫ్ స్టేట్ కమిషన్ ఫర్ పర్సనల్ డిసేబులిటీస్ కింద కోర్టులో దావలు సైతం నమోదు అవుతున్నాయి.సదరం క్యాంపుకు హాజరయ్యే దివ్యాంగులకు ఇచ్చే టోకెన్లు పెంచాలని దరఖాస్తుదారులు కోరుతు న్నారు. వైకల్యం ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నందున శారీరక వికలాంగులు, దృష్టిలోపం.. వినికిడి లోపం, మానసిక వైకల్యం తదితర సమస్యలు ఉన్న వారికి ప్రతీ విభాగానికి 200 టోకెన్లు ఇవ్వాలి .ప్రస్తుతం దివ్యాంగులందరికీ 200 టోకెన్లు మాత్రమే ఇస్తున్నారు. వీటిలోనే కొత్తవారు, రెన్యువల్ చేసుకోవాల్సిన వారు బుకింగ్ చేసు కోవాల్సిన పరిస్థితి. టోకెట్ లభించకపోతే మళ్లీ నెల రోజులు వేచి చూడాల్సి వస్తుంది.

## మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** దేశంలో మళ్లీ కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. గడిచిన కొన్నాళ్లుగా కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదు తగ్గుముఖం పెట్టింది. రెండు నెలలు కిందట కొత్త వేరియంట్ ప్రపంచంలోని అనేక దేశాల్లో వ్యాప్తి చెందింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలను అలెర్ట్ చేసింది. విదేశాల నుంచి వచ్చే వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహించాలని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. కేంద్ర హెచ్చరికలతో అప్రమత్తమైన రాష్ట్రాలు భారీ ఎతత్తున పరీక్షలు నిర్వహించాయి. కొవిడ్ పాజిటివ్ వచ్చిన వారి నుంచి మరోసారి నమూనాలు సేకరించి కొత్త వేరియంట్ నిర్ధారణకు దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లకు పంపించారు. కొత్త కేసులు నమోదు తగ్గుముఖం పట్టడం, కొత్త వేరియంట్ ప్రభావం దేశంలో పెద్దగా కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, మళ్లీ రెండు నెలలు తరువాత దేశంలో ఒక్కసారిగా కొవిడ్ కేసులు భారీగా పెరిగాయి. బుధవారం ఒక్కరోజే దేశ వ్యాప్తంగా 157 మందికి కరోనా వైరస్ సోకినట్టు కేంద్రం వెల్లడించింది. ఇవి భారీ కేసులు కానప్పటికీ ఈ మధ్యకాలంలో ఒక్కరోజు వ్యవధిలో నమోదైన అత్యధిక కేసులు కావడంతో కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఇప్పటికీ కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. నాలుగు రోజులకు మించి జ్వరం, దగ్గు, ఇతర లక్షణాలు ఉండి, మందులు వాడుతున్నా తగ్గని వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా పరీక్షలు నిర్వహించిన వారికి అవసరమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వాలు ఏర్పాట్లు చేశాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా కొవిడ్ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. ఆస్పత్రుల్లో చేరాల్సిన అవసరం లేని వారిని ఇళ్ల వద్దే హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి మానిటరింగ్ చేస్తున్నారు. ఏపీలోనూ ప్రతిరోజూ పదుల సంఖ్యలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆరోగ్యశాఖ అదికారులు చెబుతున్నారు. కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గతంలో మాదిరిగానే జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215